క్లుప్తంగా

స్థానిక ఎన్నికలకు సిద్ధమవుదాం

ఊర్కొండ: స్థానిక ఎన్నికలకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధం అవ్వాలని మండల అధ్యక్షుడు వీరారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ హరగోపాల్ అరెస్ట్ ప్రజాస్వామికం

కల్వకుర్తి రూరల్: రైతుల పక్షాన పోరాడేందుకు అచ్చంపేట నియోజకవర్గం పరిధిలోని మైలారం గ్రామానికి వెళ్తున్న పాలమూరు అధ్యయన వేదిక వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ హరగోపాల్‌ను అరెస్ట్ చేయడం అప్రజాస్వామ్యం అని పాలమూరు అధ్యయన వేదిక నాగర్ కర్నూల్ జిల్లా కన్వీనర్ వెంకట్ గౌడ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మైనింగ్ అక్రమాలను స్వయంగా పరిశీలించి ప్రజలకు వివరాలు వెల్లడించేందుకు వెళ్తున్న ప్రొఫెసర్ హరగోపాల్‌ను వెల్దండ పోలీసులు అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు.

నేటి నుంచి వార్డుసభలు

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలోని 22 వార్డులలో మంగళవారం నుంచి రేషన్ కార్డుల జారీకి గాను వార్డు సభలను నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఉన్న రేషన్‌కార్డులు యథావిధిగా ఉండటంతో పాటుగా, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వాటి కులగణన సర్వే ఆధారంగా అర్హులైన వారందరికి రేషన్‌కార్డుల జాబితాను అధికారులు సిద్ధం చేస్తారని ఆయన తెలిపారు. శుక్రవారం వరకు వార్డుసభలు కొనసాగుతాయని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

వెల్దండ: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం డాక్టర్ మంజుభార్గవికి ఆశావర్కర్లు వినతి పత్రం అందజేశారు. కనీసం వేతనం రూ.18వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు మంగమ్మ, లక్ష్మీబాయి, రాణీబాయి, శ్రీదేవి, పద్మ, సాయమ్మ తదితరులు ఉన్నారు.

తెలకపల్లి: కలెక్టరేట్ ఎదుట మంగళవారం నిర్వహించే ధర్నాకు అనుమతి ఇవ్వాలని కోరుతూ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బోపాస్ లక్ష్మణ్ ఆశావర్కర్లతో కలిసి సోమవారం వైద్యాధికారి సంధ్యారాణికి వినతి పత్రాన్ని అందజేశారు. ఆశవర్కర్లు కురువమ్మ, పార్వతీ, చంద్రకళ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేతలకు బహుమతులు ప్రదానం

చారకొండ: మండలంలోని జూపల్లిలో స్వామి వివేకానంద జయంతి వారోత్సవాల్లో భాగంగా గాంధీజీ యువజన సంఘం ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్, పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, ముగ్గుల పోటీలు నిర్వహించారు. సోమవారం విజేతలకు బహుమతుల పంపిణీ చేశారు. వాలీబాల్ మొదటి విజేతగా నిలిచిన విద్యానగర్ టీంకు మొదటి బహుమతిని డీసీసీ ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్య యాదవ్, కల్వకుర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముస్తాఫా రూ.10 వేలు, రెండో విజేతగా జూపల్లి సన్‌రైజర్స్ జట్టుకు మాజీ ఉప సర్పంచ్ జగపతి రూ.5 వేలు అందజేశారు. గాంధీజీ యువజన సంఘం అధ్యక్షుడు నాయిని పరంజ్యోతి క్రీడల్లో విజేతలకు షీల్డులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాములు యాదవ్, బొజ్జయ్య, బిక్కన్, సిరాజ్, కమాలోద్దీన్, భిక్షపతి యాదవ్, గాంధీ యువజన సంఘం సభ్యులు, క్రీడాకారులు తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం



వంగూరు: మండలంలోని సర్వారెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సోమవారం కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ పండిత్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్‌ఐ మహేందర్, మాజీ సర్పంచ్ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కమిటీ సభ్యుడిగా నిరంజన్

నాగర్‌కర్నూల్‌రూరల్: దివ్యాంగుల విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా కందనూలు నిరంజన్‌ను సోమవారం కలెక్టర్ బదావత్ సంతోష్ నియమించారు. దివ్యాంగులకు ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల్లో కార్యదర్శిగా పనిచేస్తున్న నిరంజన్‌ను దివ్యాంగుల విభాగం విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా ఎంపిక చేశారు.

నేటి నుంచి గ్రామసభలు



అచ్చంపేటలో మాట్లాడుతున్న ఆర్డీఓ మాధవి



కల్వకుర్తిలో సమీక్ష సమావేశంలో సూచనలు చేస్తున్న ఆర్డీఓ శ్రీను నాయక్



చారకొండలో సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్

ఉప్పునుంతల: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈనెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజులపాటు గ్రామసభలు నిర్వహిస్తునట్లు అచ్చంపేట ఆర్డీఓ మాధవి తెలిపారు. సోమవారం స్థానిక రైతు వేదికలో గ్రామసభల నిర్వాహణపై మండలంలోని అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఇటీవల గ్రామాల్లో పరిశీలన బృందాలు రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులపై నిర్వహించిన పరిశీలన రిపోర్టును గ్రామ సభల్లో చదివి ప్రజలకు వినిపించి ఆమోదం పొందాలని సూచించారు. ప్రజల నుంచి ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరించాలన్నారు. సమావేశంలో గ్రామసభల ప్రత్యేకాధికారి చందునాయక్, తహసీల్దార్ ప్రమీల, ఎంపీడీఓ మోహన్‌లాల్, ఏఓ రమేష్‌నాయక్, డిప్యూటీ తహసీల్దార్ కేశవ్, ఎంపీఓ నారాయణ, పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓలు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష

కల్వకుర్తి రూరల్: గ్రామసభల్లో ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి, ఆర్డీఓ శ్రీను నాయక్ అధికారులకు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఏఓ, ఎంపీఓ, ఏఈఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. మంగళవారం పంజుగుల, మార్చాల, తర్నికల్, జీడిపల్లి, 24న వేపూరు, తర్నికల్ తండా, తోటపల్లి, తాండ్ర గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ప్రజలు అందుబాటులో ఉండాలి

వెల్దండ: సంక్షేమ పథకాలకు అర్హుల జాబితాల కోసం ప్రత్యేకంగా నిర్వహించే గ్రామసభలకు గ్రామస్తులు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల21న బండోనిపల్లి, బొల్లంపల్లి, కొట్ర, తిమ్మినోనిపల్లి, పోషమ్మగడ్డతండా, ఉబ్బలగట్టుతండా, అజిలాపూర్, కుందారంతండా, 22వ తేదీన గానుగట్టుతండా, భర్కత్‌పల్లి, రాచూర్, కుప్పగండ్ల, గుండాల, చెదురుపల్లి, బైరాపూర్, నగారగడ్డతండా, 23నా కేస్లీతండా, మర్రిగుంతతండా, చౌదర్‌పల్లి, రాఘయపల్లి, అల్లంతోటబావితండా, నారాయణపూర్‌తండా, పోతేపల్లి, లింగారెడ్డిపల్లి, 24న వెల్దండ, కంటోనిపల్లి, పెద్దాపూర్, చెర్కూర్, ఎంజీ కాలనీతండా, సిలోనిబావితండా, శంకరకొండతండా, పల్గుతండాడ గ్రామాల్లో ప్రత్యేక అధికారుల సమక్షంలో గ్రామసభలు నిర్విహస్తునట్లు తెలిపారు.

కోడేరు: మండలంలోని నాగులపల్లిలో సర్వేను తహసీల్దార్ విజయ్‌కుమార్, అధికారులు పరిశీలించారు. ఆర్‌ఐలు సురేందర్, జమ్ములయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మూడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు

చారకొండ: పకడ్బందీగా గ్రామసభలు నిర్వహించేందుకు మూడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు గాను మూడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం మర్రిపల్లి, శాంతిగూడెం, సారంబండ తండా, కమాల్‌పూర్, గోకారం, చంద్రాయన్‌పల్లి. బుధవారం చారకొండ, శేరి అప్పారెడ్డిపల్లి, జూపల్లి, జేపల్లి, అగ్రహారం తండా, రామచంద్రాపురం. గురువారం సిర్సనగండ్ల, తుర్కలపల్లి, తిమ్మాయిపల్లి, ఎర్రవల్లి, గైరాన్‌తండా గ్రామాలకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీఓ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

లింగాల: గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న వల్లభాపూర్, రాంపూర్, అంబట్‌పల్లి, లింగాల, దత్తారం, జీల్గుపల్లి, అప్పాయపల్లి, పద్మన్నపల్లి, 22న బాకారం, సూరాపూర్, శాయిన్‌పేట, అవుసలికుంట, చెన్నంపల్లి, దారారం, రాయవరం, క్యాంపురాయవరం, కోమటికుంట, కొత్తకుంటపల్లి, 23న మగ్దూంపూర్, శ్రీరంగాపూర్, ఎంసీతండా, కేసీతండా, అప్పాపూర్ గ్రామ పంచాయతీలలో గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు నిబంధనలు అతిక్రమించొద్దు



నాగర్‌కర్నూల్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ క్రైం: వాహనదారులు రోడ్డు నియమ నిబంధలు అతిక్రమించొద్దని మితిమీరిన వేగంతో ప్రమాదాలకు గురై కుటుంబ సభ్యులకు దుఃఖాన్ని మిగిలించొద్దని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి కోరారు. జిల్లాకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం రోడ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత-ప్రజల క్షేమం కార్యక్రమానికి సంబంధించిన ఆయన పోస్టర్‌ను విడుదల చేశారు. కౌన్సిలర్ కొత్త శ్రీనివాసులు, రోడ్ సేఫ్టీ-ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ వెంకటేష్, వైస్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్ గౌడ్, ఫిజియోథెరపిస్టు సుమంత్, రాజశేఖర్ శర్మ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

తాడూరు: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం 21 మంది రైతులకు ప్రభుత్వ సబ్సిడీ ద్వారా మంజూరైన స్ప్రింక్లర్లను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా జనవరి 26 నుంచి రైతు భరోసా అమలు అవుతుందన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ జిల్లా అధికారి జగన్, వ్యవసాయ మార్కెట్ కమటీ చైర్మన్ రమణరావు, పీఏసీఎల్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, తహసీల్దార్ కారణ్మయి, ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంపీఓ బ్రహ్మచారి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబసభ్యులకు పరామర్శ

తిమ్మాజిపేట: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకుడు జోగు దేవ స్వామి భార్య పద్మ ఇటీవల మృతి చెందడంతో సోమవారం నిర్వహించిన దశదినకర్మలో ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొంది ఇంటివద్ద ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఏఎస్‌ఐ గుణవర్ధన్‌ను పరామర్శించారు. వివేక్‌రెడ్డి, దానం బాల్‌రాజ్, భాస్కర్‌రెడ్డి, లింగం, మాధవులు, లక్ష్మీనారాయణ, నాగసాయిలు, దామోదర్‌రెడ్డి, వెంకటయ్య, వెంకట్రాములు, ఎల్లారెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

అపార్ నమోదుపై అవగాహన

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు సోమవారం ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్) నమోదుపై అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల పరిధిలోని స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఇమ్మానుయేల్ మాట్లాడుతూ అపార్ ఐడీ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఐడీ నమోదులో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కారాల గూర్చి ఆయన వివరించారు. సమావేశంలో హెచ్‌ఎంలు శోభారాణి, రాజవర్ధన్‌రెడ్డి, వనజ, కురుమయ్య, వాణి, శ్రీనివాసులు ఉన్నారు.

వివరాల సేకరణ

తెలకపల్లి: సంక్షేమ పథకాల కోసం అర్హులను గుర్తించేందుకు అధికారులు గ్రామాల్లో సర్వే నిర్వహిస్తూ వివరాలు సేకరిస్తున్నారు. గౌరారం, వట్టిపల్లి తదితర గ్రామాల్లో అధికారులు సర్వే నిర్వహించారు. గౌరారంలో మండల ప్రత్యేక అధికారి రామ్‌లాల్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీఓ వెంకటయ్య, ఆర్‌ఐ శ్రీనివాస రావు, ఏఈఓ, పంచాయతీ కార్యదర్శి, వట్టిపల్లిలో ఏఓ నర్మదా పాల్గొని సర్వే పరిశీలించారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి



అచ్చంపేటలో వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

అచ్చంపేట రూరల్: సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈనెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే సీపీఎం నాల్గో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సీపీఎం మండల కార్యదర్శి మల్లేష్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్, హరీష్‌నాయక్, నాగరాజు, అరుణ పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా ఈ నెల 25న నిర్వహించే సీపీఎం రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం మండల కేంద్రంలో సీపీఎం జిల్లా నాయకులు ఈశ్వర్ విడుదల చేశారు. కార్యక్రమంలో తిమ్మస్వామి, రాజు, ముత్తయ్య, చెన్నమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్లపై చెట్ల తొలగింపు



కల్వకుర్తి టౌన్: పట్టణంలో డివైడర్లపై ఏపుగా పెరిగిన చెట్లతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వెంటనే కొమ్మలు తొలగించాలని కోరుతూ సోమవారం మానవత ఫౌండేషన్ సభ్యులు మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్‌కు వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందిస్తూ ప్రధాన కూడళ్లలో మలుపుల వద్ద చెట్ల కొమ్మలను సిబ్బందితో తొలగించారు. మానవత ఫౌండేషన్ అధ్యక్షురాలు డా. రమ్య, సభ్యులు డా.శరత్ వీరమళ్ల, సందీప్, ప్రవీణ్, ఉదయ్‌లు పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా ఆత్మీయ భరోసా ఇవ్వాలి



తాడూరు: ఎటాంటి ఆంక్షలు లేకుండా అర్హులందరికి ఆత్మీయ భరోసా ఇవ్వాలని బీఎంఎస్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే రాజేష్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్లమెంటు ఇన్‌చార్జ్ విజయ్ మాట్లాడుతూ ఉపాధిహామీ పనిలో 20 రోజులు పనిచేయాలని నిబంధన ఎత్తేయాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మల్లయ్య, శ్రీనివాస్, వెంకటేశ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సారా తయారు చేస్తే చర్యలు



నగారగడ్డతండాలో బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు

వెల్దండ: సారా తయారు చేస్తే చర్యలు తీసుకుంటామని డీటీఎఫ్ మహబూబ్‌నగర్ ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం మహబూబ్‌నగర్, కల్వకుర్తి ఎక్సైజ్ టీమ్‌లు సంయుక్తంగా వెల్దండ మండలంలోని నగారగడ్డతండా, పోషమ్మతండా, వెల్దండంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సారా స్థావరాలపై దాడులు చేసి 550లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 16 లీటర్ల సారాను పట్టుకున్నారు. నగారగడ్డతండాకు చెందిన గోపాల్, పాండులపై కేసు నమోదు చేసి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో స్పెషల్ డ్రైవ్ డిప్యూటీ ఎస్‌ఐ పురుషోత్తంరెడ్డి, సిబ్బంది మహేష్, నార్యా, మాధవి, కృష్ణయ్య, ఎరియా, మహేష్ తదితరులు ఉన్నారు.

పేదల పక్షాన నిరంతరం పోరాటం



తిమ్మాజిపేట: పేదల పక్షాన నిరంతరం పోరాడుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం బాల నర్సింహ అన్నారు. సోమవారం పార్టీ శత ఆవర్భావ వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలో ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఖాజమైనోద్దీన్, జిల్లా కార్యదర్శి శివశంకర్, ఏఐవైఎఫ్‌జిల్లా ఉపాధ్యక్షుడు శివకృష్ణ, యాదయ్య, రాములు, ఆంజనేయులు, శ్రీరాములు, జంగయ్య, గోపాల్ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని రవితేజ కళాశాలలో 1998–2000 సంవత్సరంలో విద్యను అభ్యసించిన విద్యార్థులు సోమవారం స్థానిక హిమాలయ ఫంక్షన్‌హాల్‌లో సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు అప్యాయంగా పలకరించుకొని ఉద్యోగ, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధికి వ్యాపారులు సహకరించాలి



కల్వకుర్తి రూరల్: వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి వ్యాపారులు సహకరించాలని రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని మార్కెట్ చైర్మన్ మనీలా సంజీవ్ యాదవ్ కోరారు. మార్కెట్ లోకి అమ్మడానికి వేరుశెనగ పంటను తీసుకొచ్చిన రైతులతో మాట్లాడారు. కల్వకుర్తి మార్కెట్ పరిధిలో ఉన్న డిగాడిగేటర్ల యజమానులు కల్వకుర్తి మార్కెట్లో అమ్మకానికి వచ్చిన వేరుసెనగ పంటకు కచ్చితంగా టెండర్లు వేయాలని కోరారు. మార్కెట్ ఆదాయం పెంపొందించేందుకు వ్యాపారులు సహకరించాలని సూచించారు. మార్కెట్‌కు వేరుశనగ పంట అమ్మడానికి వచ్చిన రైతులకు ప్రతినిత్యం భోజన సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పండిత్‌రావు, మార్కెట్ సిబ్బంది ఉన్నారు.

డివిజన్ అధ్యక్షుడిగా కాళ్ల ప్రసాద్

తిమ్మాజిపేట: మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాగర్‌కర్నూల్ డివిజన్ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన కాళ్ల ప్రసాద్ ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన మాదిగ ఎంప్లాయిస్ డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. డివిజన్ ఉపాధ్యక్షుడిగా బాలస్వామి, సుభాషిని, సంతోషమ్మ, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్, కోశాధికారిగా బాల లక్ష్మయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పరశురాం, కార్యదర్శులుగా నాగభూషణ సైదులు, కురుమూర్తి, శ్రీనివాసులు, మరో ఆరుమందిని ఎంపిక చేశామన్నారు. సలహాదారుకురుమయ్య, భగవంత్, విష్ణుమూర్తి ఎన్నికయ్యారు. సమావేశంలో డాక్టర్లు దశరథం, నారాయణ, బాలస్వామి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో సర్వశిక్ష అభియాన్ పథకంలో భాగంగా మంజూరైన రూ. 27లక్షలతో చేపట్టనున్న పాఠశాల అదనపు గదులకు సోమవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు భూమి పూజ చేశారు. ఉస్మాన్, శ్రీనివాస్‌బహదూర్, లక్ష్మీనారాయణ, మాధవులు, రవీందర్‌రెడ్డి, లింగం, హర్షవర్ధన్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, దామోదర్‌రెడ్డి, వెంకటయ్య, శేఖర్, మల్లేష్, యదగిరి పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు నగదు అందజేసిన శ్రీనివాస్ తదితరులు

కల్వకుర్తి రూరల్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వాసవీ క్లబ్ జోన్ చైర్మన్ చిదిరే శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మార్చాలలో జెడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతి చదువుతున్న ఎనిమిది మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బాదం రాఘవేందర్, జిల్లా ఆఫీసర్ గుగ్గిల శంకర్, హెచ్‌ఎం వెంకటరమణ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాడిపశువులను కాపాడుకుందాం



మందులను పంపిణీ చేస్తున్న వైద్యులు

వెల్దండ: పాడిపశువులను కాపాడుకుందామని డాక్టర్ శ్యాంసుందర్ అన్నారు. సోమవారం మండలంలోని బొల్లంపల్లిలో టీఎస్ఎల్‌డీఏ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పశువులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనాథ్, నరేష్‌రెడ్డి, విజయడెయిరీ అధ్యక్షుడు యాదయ్య, రమేష్, రైతులు మల్లేష్, రమేష్, వెంకటయ్య, గోపాలమిత్ర లక్ష్మయ్య, విజయేందర్, బాలు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల నిరసన



పెద్దకొత్తపల్లి: తక్కుగూడ ప్రధాన ఉపాధ్యాయుడిపై దాడికి నిరసనగా భోజన విరామ సమయంలో జొన్నలబొగుడ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయుడు రాము మాట్లాడుతూ హెచ్‌ఎంపై దాడి చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఆందోళన

అచ్చంపేట రూరల్: పట్టణంలోని సర్వేనెంబర్ 293లో గల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో ఉన్న తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. మంగ్యానాయక్, బాలాజీ, నాగరాజు, జానకి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనునాయక్, చందులాల్, జగదీష్‌గౌడ్, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



తూంకుంటలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ నర్సింహులు

పాన్‌గల్: బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 'పిల్లలు బడిలో-పెద్దలు పనిలో' కార్యక్రమాన్ని చేపట్టిందని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. బడిబయట పిల్లల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. ఆరేళ్ల నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. బడిబయట ఉన్న 8వ తరగతి విద్యార్థి సాయిచరణ్‌ను గుర్తించి తల్లిదండ్రులతో మాట్లాడి బాలుడిని బడిలో చేర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేష్‌యాదవ్, సీఆర్పీలు గోవింద్‌నాయక్, రమాదేవి, భార్గవి పాల్గొన్నారు.

బడిలో చేర్పించేందుకు సహకరించాలి

వీపనగండ్ల: బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించడం తల్లిదండ్రులు బాధ్యతగా భావించాలని మండల విద్యాధికారి నర్సింహులు అన్నారు. బడిబయటి పిల్లల సర్వేలో భాగంగా సోమవారం తూంకుంటలో ఇంటింటి సర్వే నిర్వహించారు. విద్యార్థులు పాఠశాలలు మానిపించి పనులకు తీసుకెళ్తే వారి హక్కులను హరించినవారం అవుతామని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. ఈ నెల 25 తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో బడి బయటి పిల్లలపై ఇంటింటి సర్వే కార్యక్రమం కొనసాగుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, సీఆర్పీ వెంకటేష్, నాగరాజు పాల్గొన్నారు.

కారు, ట్రాక్టర్ ఢీ: కేసు నమోదు

వెల్దండ: కారు, ట్రాక్టర్ ఢీకొన్న ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ కురుమూర్తి వివరాల ప్రకారం హైదరాబాదు నుంచి సిర్సనగండ్ల గ్రామానికి కారులో ముగ్గురు ప్రయాణిస్తున్నారు. పెద్దాపూర్ గ్రామానికి చెందిన వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్ రాఘయిపల్లి వెళ్తోంది. పెద్దాపూర్ గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న కారును ట్రాక్టర్ ఢీకొన్నది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న అలివేలు, పర్వతాలుకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కల్వకుర్తి ఆస్పత్రిలో చేర్పించారు. సోమవారం కారు డ్రైవర్ సాయికుమార్ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ కొండల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.